క్లుప్తంగా

బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

తుని: చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇద్దరు మైనర్ బాలికలను స్థానిక జీఆర్పీ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా అగనంపూడికి చెందిన ఇద్దరు మైనర్ బాలికలు ఆదివారం ఉదయం ఇంట్లో చెప్పకుండా బయటకు వచ్చారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వచ్చి బొకారో ఎక్స్‌ప్రెస్ ఎక్కి రాజమండ్రి వైపు వెళుతున్నారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్సై శ్రీనివాసరావు బాలికలను పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. స్నేహితుల దినోత్సవం కావడంతో బాలికలు ట్రైన్‌లో ప్రయాణించేందుకు యత్నించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

ప్రత్తిపాడు: మండలంలోని ఇ.గోకవరంలో తన పంటకు నష్టం చేకూర్చిన వ్యక్తిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలంటూ బాధిత రైతు సత్తి వినోద్ కుమార్‌రెడ్డి చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం 6వ రోజుకు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ, రాజమండ్రికి చెందిన తాను మండలంలోని ఇ.గోకవరంలో పది ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ భూమిని సాగు చేయనివ్వకుండా తరచూ కొంత మంది అడ్డుపడి దాడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు పోలీసులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

నేటి నుంచి ముత్యాలమ్మ జాతర


గ్రామదేవత ముత్యాలమ్మ

గోకవరం: మండలంలోని పెంటపల్లి గ్రామదేవత ముత్యాలమ్మ జాతర సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఐదు రోజులపాటు జరిగే జాతర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జాతరలో మూడో రోజు అమ్మవారి ఊరేగింపు, నాల్గవ రోజు గ్రామంలోని ఆడపడుచులతో బోనాల సమర్పణ, ఈనెల 10 అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

మొక్కలు నాటిన స్నేహితులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్, ఎస్టేట్ మేనేజర్ మేడపాటి భాస్కర చంద్రారెడ్డి స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మొక్కలు నాటి ఇతర స్నేహితులకు వారు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేగు బంధాన్ని మించినది స్నేహబంధం ఒక్కటేనని, కుల, మత వర్గ భేదాలకు తావులేకుండా అందరూ స్నేహభావంతో మెలిగిన నాడు సమాజంలో మనస్పర్థలకు అవకాశం ఉండదన్నారు.

వ్యర్థాల తొలగింపు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌ల్లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ


చోరీ చేసిన హుండీ

ఏలేశ్వరం: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న దుర్గమ్మ తల్లి ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు గుడి తాళాలు పగలగొట్టి రెండు రాగి చెంబులు, నాలుగు ఇత్తడి పళ్లెలు, ఒక శఠగోపం దొంగిలించారు. హుండీ తాళాలు పగలగొట్టి నగదు అపహరించారు. ఎంత నగదు ఎత్తుకెళ్లారనేది తెలియరాలేదు. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

పలువురికి ముదునూరి పరామర్శ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బవురువాక గ్రామంలో వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆదివారం పర్యటించారు. స్థానిక సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, బేత అర్జున్ ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వారిని మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సతీష్ రాజు, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాశీ కావిడ యాత్ర

జగ్గంపేట: పట్టణంలో మార్వాడీలు శ్రావణమాసంలో నిర్వహించే కాశీ కావిడ యాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజగోపాలస్వామి ఆలయం నుంచి ఇర్రిపాకలోని మల్లిఖార్జున స్వామి ఆలయం వరకూ నడుచుకుంటూ కావిడ యాత్రను కొనసాగించారు. గోదావరి జలాలతో భ్రమరాంబిక అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

వర్షమా.. నీవెక్కడ?

- వరుణుడి కోసం రైతుల ఎదురుచూపులు
- నీరు లేక ఎండిపోతున్న నారుమడులు
- అద్దె ఇంజిన్‌తో నీటి సరఫరా


జగపతినగరంలో ఎండిపోయిన నారుమడి

కిర్లంపూడి: గత వారం రోజులుగా వేసవిని తలపించేలా భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో ఏటా ఖరీఫ్‌లో 6,500 హెక్టార్లలో వరి సాగుచేస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు అనుకూలించడంతో రైతులు హుషారుగా వరి నారుకు విత్తనాలు చల్లుకున్నారు. ప్రస్తుతం ఎండ వేడికి జగపతినగరం, చిల్లంగి, వేలంక, సింహాద్రిపురం తదితర గ్రామాల్లో నారుమడులు ఎండిపోయే పరిస్థితికి చేరాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రస్తుతం 4,700 హెక్టార్లలో మాత్రమే వరి సాగు

మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో ఏటా సుమారు 6,500 హెక్టార్లలో వరినాట్లు వేసేవారు. అదే మాదిరిగా ఈ ఏడాది కూడా రైతులు ఆకుమడులు వేశారు. కానీ, వర్షాలు పడకుండా ఎండలు కాయడంతో మెరక పొలాల్లోని నీరు మడుల్లో ఇంకిపోయింది. దీంతో ఏలేరు కాలువల్లో వస్తున్న అరకొర జలాలతో కిర్లంపూడి, రాజుపాలెం, ముక్కొల్లు, రామకృష్ణాపురం, వీరవరం, రామచంద్రపురం, గోనేడ, తామరాడ, గెద్దనాపల్లి, సోమరాయణంపేట, బూరుగుపూడి, కృష్ణవరం, సోమవరం, గెద్దనాపల్లి గ్రామాల్లోని 4,700 హెక్టార్లలో మాత్రమే వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

వరుణుడి కోసం ఎదురుచూపు

వారం రోజులుగా ఎండ తీవ్రత పెరగడంతో వర్షపు నీటిపై ఆధారపడి సాగు చేసే జగపతినగరం, సింహాద్రిపురం, వేలంక గ్రామాల్లో వరినాట్లు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో నారుమడులను సంరక్షించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదనపు భారమైనా లెక్క చేయకుండా సమీప చెరువులు, బావులు, కిరాయికి మోటర్ నీరు అద్దెకు పెట్టుకొని నీటిని సరఫరా చేసుకుంటున్నారు. వర్షాలు పడకపోతే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


నీరులేక ఎండిపోతున్న దమ్ముమడి

ఆయిల్ ఇంజిన్లకు డిమాండ్

మెట్ట గ్రామాల్లో వారం క్రితం కురిసిన చిరుజల్లుతో నేలలు చిత్తడిగా మారడంతో చేతులతోనే బురదలో వరి విత్తనాలను కలిపి నారుమడులు తయారు చేశారు. ఆ తరువాత వర్షం కురుస్తుందని ఆశించినా కనీసం చిరుజల్లులు కూడా లేకపోవడంతో నారుపోసిన మడి ఎండిపోవడంతో విత్తనాలు సరిగ్గా మొలకెత్తలేదు. రైతులు నారుమడులకు నీటిని సరఫరా చేసేందుకు ఆయిల్ ఇంజిన్ల కోసం పరుగులు పెడుతున్నారు. దీంతో మోటార్లకు డిమాండ్ ఏర్పడింది.

అదనపు భారం పడుతుంది



వర్షాలు రాకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల ఆయిల్ ఇంజిన్ అద్దెకు పెట్టుకొని నారుమడికి నీరు పెడుతున్నాను. ఒక ఆకుమడి తడిపేందుకు సుమారు 5 గంటల సమయం పడుతుంది. గంటకు రూ.500 చొప్పున 5 గంటలకు రూ.2,500లు అదనపు భారం అవుతుంది. ఇలా ఆకుమడులు అయితే కాపాడుకుంటున్నాం కానీ వర్షాలు లేకపోతే ఊడుపు ఉడవడం కష్టం.

– యల్లపు నానాజీ, రైతు, జగపతినగరం

ఆకుమడులు కాపాడుకోవాలి



ఎండలకు మెరక పొలాల్లో నారుమడులు ఎండిపోయి రైతులు బెట్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఎండిన వరినారుపై 19.19.19 (నీటిలో కరిగిపోయే లక్షణం) ఎరువును ఒక లీటరు నీటిలో 2 మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేయాలి. దీంతో నారుమడి ఆరోగ్యంగా, దృఢంగా ఎదగడానికి దోహదపడుతుంది.

– సుధామాధురి, ఏఓ, కిర్లంపూడి

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత


చినశంకర్లపూడిలో బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎంపీపీ

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడి గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాలకు ఆదివారం ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ బియ్యం పంపిణీ చేశారు. గ్రామంలోని హరిజనవాడలో సంభవించిన అగ్ని ప్రమాదానికి ఆరు తాటాకిళ్లు కాలిపోయిన సంగతి తెలిసిందే. ఒక్కొక్క బాధిత కుటుంబానికి 25 కేజీల చొప్పున బియ్యాన్ని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏపూరి రామారావు, ఎంపీటీసీ పిల్లా కొండలరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగ్గంపేట వచ్చిన కాకినాడ కింగ్స్ టీం

జగ్గంపేట: విశాఖపట్నంలో జరిగే ఆంధ్రా ప్రీమియర్ లీగ్ పోటీల్లో కాకినాడ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ కింగ్స్ టీం ఆదివారం జగ్గంపేట వచ్చారు. టీం కెప్టెన్ భరత్ ఆధ్వర్యంలో కాకినాడ కింగ్స్ టీం విజయం సాధించాలని కోరుతూ స్థానిక నేతలు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. టీం సభ్యులను శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం కెప్టెన్ భరత్ మాట్లాడుతూ, తన పూర్వీకులది జగ్గంపేట నియోజకవర్గమని, అందుకే ఇక్కడి నేతల ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చామని చెప్పారు.

విఫలమైన చంద్రబాబు ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు

తుని రూరల్: చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పరిపాలనలో విఫలమయ్యిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు మోసపోయారని వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు అన్నారు. ఆదివారం తేటగుంట గ్రామంలో ఆ పార్టీ నాయకుడు చోడ్రాజు రాంబాబు రాజు, వల్లూరులో మాజీ వైస్ ఎంపీపీ కుర్ర బాబ్జి, చేపూరులో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం మోసగించిందన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తే చంద్రబాబు నాయుడు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. రైతులు కూటమి ప్రభుత్వంలో అన్ని విధాలా మోసపోయారన్నారు. ఏడాది కాలంలో చంద్రబాబు చేసిన మోసాలను మహిళలకు వివరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, సర్పంచ్ అత్తి నాగరాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొల్లపల్లి నూకరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై ప్రశ్నించండి

కోటనందూరు: సంక్షేమ పథకాల అమలులో సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలపై కూటమి నేతలను ప్రశ్నించాలని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి లాలం బాబ్జి పిలుపునిచ్చారు. ఆదివారం కోటనందూరులో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వాణిజ్య విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ వెలగా వెంకట కృష్ణాజీ తదితరులతో కలిసి ఇంటింటా పర్యటించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఏ స్థాయిలో ప్రజలను మోసం చేస్తుందో గణాంకాలతో సహా వివరించారు. జగన్ ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని అంచనా వేయాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కోటనందూరులో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న లాలం బాబ్జి తదితరులు

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెప్పాలి

తొండంగి: రాష్ట్ర ప్రజలకు అడ్డగోలు హామీలిచ్చి అమలు చేయని చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెప్పాలని వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు అన్నారు. ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు మండలంలోని ఏ.కొత్తపల్లిలో 'బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో కొన్నింటిని మాత్రమే మొక్కుబడిగా అమలు చేశారన్నారు. అనంతరం ఇంటింటా పర్యటించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన లబ్ధిని గుర్తు చేస్తూ బాబు పాలనలో జరిగిన మోసంపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కొయ్యా మురళి, మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మడదా హేమంత్, రాష్ట్ర బూత్ కన్వీనర్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బెక్కం చంద్రగిరి, మండల యూత్ కన్వీనర్ పప్పల వెంకట్, జిల్లా కమిటీ సభ్యుడు సాపిశెట్టి చిన్న, ఎలుగుబంటి రామకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.


ఏ.కొత్తపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న యనమల కృష్ణుడు, నాయకులు

బెల్టు షాపులు మూసేయాలని నిరసన

గోకవరం: నిరుపేద కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న బెల్టు షాపులను తక్షణమే మూసివేయాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని రంపయర్రంపాలెం గ్రామంలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బెల్టు షాపులపై నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యం నిషేధిస్తామని హామీ ఇచ్చి వాటిని కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని విమర్శించారు. గ్రామాల్లో వీధికి ఓ బెల్టు షాపు ఉన్నా.. చూసి చూడనట్టు అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో నిరుపేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్న జ్ఞానం లేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిల్లా వ్యాప్తంగా ఉన్న బెల్టు షాపులు మూసివేసి, ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి సతీష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


బెల్టు షాపులు నిర్మూలించాలని నిరసన చేస్తున్న నాయకులు

కమ్మేస్తున్న వ్యర్థాల పొగ

తుని రూరల్: డి.పోలవరం గ్రామంలో రోజువారీగా సేకరించే వ్యర్థాలను తాండవ బ్రిడ్జి వద్ద దగ్ధం చేస్తుండటంతో రోడ్డుపై వ్యర్థాల పొగ కమ్మేస్తుంది. డంపింగ్ యార్డు లేకపోవడం, తడి, పొడి చెత్త వేరుచేసే ప్రక్రియ ప్రారంభించకపోవడంతో గ్రామంలో సేకరించిన చెత్త, ఇతర వ్యర్థాలను సమీపంలోని తాండవ నది, స్మశానవాటిక వద్ద వేస్తున్నారు. అవి కుప్పలుగా పేరుకుపోతుండటంతో అప్పుడప్పుడు చెత్తకు నిప్పు పెడుతున్నారు. దీంతో నిత్యం పొగ కమ్మేస్తుంది. అటు నుంచి డి.పోలవరం వచ్చే సుభద్రయ్యమ్మపేట, కొలిమేరు, ఎన్.సూరవరం, ఎన్ఎస్‌వీ నగరం తదితర గ్రామస్తులతో పాటు పొలాలకు వెళ్లొచ్చే రైతులు పొగతో ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వ్యర్థాలను దూరంగా దగ్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


రోడ్డును కమ్మేసిన పొగ

మితిమీరిన కూటమి నేతల ఆగడాలు

- కల్వర్టు ధ్వంసం చేసి అక్రమంగా కాలువ తవ్వకం
- అడ్డుకున్న సర్పంచ్, దళిత నాయకులు

తుని రూరల్: హంసవరంలో కూటమి నాయకుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని సర్పంచ్ రాయి మేరీ అవినాష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాందాసు ఆరోపించారు. ఆదివారం కూటమి పార్టీకి చెందిన నాయకుల ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాల వద్ద గ్రామానికి చెందిన ఉమ్మడి భూమిలో కాలువ తవ్వడం, కల్వర్టు ధ్వంసం చేయడాన్ని సర్పంచ్, మాజీ ఎంపీటీసీ రాందాసు, దళిత నాయకులు అడ్డుకున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామానికి చెందిన 3.80 ఎకరాల ఉమ్మడి భూమి పాఠశాల సమీపంలో ఉందన్నారు. కొంత భాగాన్ని వెనుకబడిన వర్గాలు శ్మశాన వాటికగా, మరికొంత భాగాన్ని రాకపోకలకు, గడ్డి వాములు వేసుకోవడం, చిన్నపిల్లల బహిర్భూమిగా వాడుకుంటున్నారన్నారు. పాఠశాల సమీపంలో కాలువ తవ్వడం వల్ల చిన్నారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, దిగువన ఉన్న ఎస్సీ కాలనీలో ఇళ్లన్నీ ఊటదేరి కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. పుష్కర కాలువ ద్వారా వేమన చెరువుకు నీరు చేరుతుండగా రెండో కాలువ ద్వారా మళ్లించేందుకు ఈ కాలువ తవ్వుతున్నట్టు పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం సమస్య పరిష్కరిస్తామన్నారు. అధికారుల అనుమతి లేకుండా కాలువ తవ్వడానికి పాల్పడిన నాయకులపై చర్యలు తీసుకోవాలన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న సర్పంచ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు


కాలువ తవ్వకం ఇలా..

ముద్రగడ ఆరోగ్యంగా ఉండాలని పూజలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వాకపల్లిలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని వైఎస్సార్ సీపీ శ్రేణులు స్థానిక వినాయకుడి గుడిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన ప్రజా జీవితంలోకి తొందరగా రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బర్ల గోవింద్, అవ్వ ఆదినారాయణ, కిలాడీ శివ తదితరులు పాల్గొన్నారు.


వాకపల్లిలో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోదావరి జలాలకు సారె

గోకవరం: మండలంలోని వెదురుపాక శివారున పోలవరం కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలకు గ్రామస్తులు ఆదివారం సారె సమర్పించారు. ఉదయం గ్రామ శివారున ఉన్న పోలవరం కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు, కుంకుమ, చీర, గాజులు, పువ్వులు నదీ జలాల్లో విడిచిపెట్టారు. పంటలు సమృద్ధిగా పండాలని ఈ విధంగా సారె సమర్పించినట్టు ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లా చంటిబాబు, మడక వెంకటేశులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట శివారులో పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. పేకాడుతున్నట్టు వచ్చిన సమాచారంతో ఎస్సై శివ నాగబాబు సిబ్బందితో దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3,250 నగదును స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

వీఏఏకి సత్కారం


ముక్కొల్లులో వీఏఏని సత్కరిస్తున్న రైతులు

కిర్లంపూడి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు అపూర్వ గౌరవం దక్కుతుందని ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు అన్నారు. ముక్కొల్లులోని సర్పంచ్ జ్యోతుల రాంబాబు అధ్యక్షతన వీఏఏని ఆదివారం సత్కరించారు. ఈ కార్యక్రమానికి బస్వా వీరబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో ఐదేళ్లగా వీఏఏగా సేవలందించిన రాజాల అబ్బాయిని స్థానిక రైతులతో కలిసి వీరబాబు పూలమాలతో సత్కరించారు. ప్రభుత్వ సంబంధిత సేవలను రైతులకు సకాలంలో అందించారని కొనియాడారు.

బీసీలు ఐక్యంగా ఉండాలి

ప్రత్తిపాడు రూరల్: బీసీలు ఐక్యంగా ఉండాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఒమ్మి గంగరాజు అన్నారు. మండలంలోని బవురువాకలో సీమాంధ్ర బీసీ సంఘం లీగల్ సెల్ సలహాదారుడు కిలపర్తి శ్రీనివాసరావు వ్యవసాయ క్షేత్రంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ఒమ్మి గంగరాజును సంఘ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలపడేందుకు సంఘం పనిచేస్తుందని పలువురు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత దక్కేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీమాంధ్ర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ముచ్చి అప్పలరాజు, ఉపాధ్యక్షుడు బర్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

- ఇందులో ఒకరు దేవస్థానం ఉద్యోగి

అన్నవరం: స్థానికంగా ఓ లాడ్జిలో పేకాడుతున్న ఐదుగురిని అన్నవరం పోలీసులు పట్టుకున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందులో ముగ్గురు స్థానిక వ్యాపారులు, ఒక దేవస్థానం ఉద్యోగి, మరో వ్యక్తి కలిసి దేవస్థానం హైస్కూల్ సమీపంలోని లాడ్జిలో పేకాడుతుండగా శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.40 వేలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. వారిపై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. అయితే రాజకీయ ఒత్తిడితో వారి పేర్లు పోలీసులు గోప్యంగా ఉంచారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

ఏలేశ్వరం: స్నేహానికి కన్నా మిన్నా లోకాన లేదు అన్నట్టుగా స్నేహితుల దినోత్సవం నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్నేహితులందరూ కలుసుకుని యోగాక్షేమాలతో పాటు గత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్నేహితులందరూ కలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సెలర్ సామంతుల సూర్యకుమార్ ఇంటి వద్ద స్నేహితులతో కలిసి కేక్ కట్ చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా స్నేహమే చివరి వరకు తోడుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పైల విజయ్‌కుమార్, వాగు బలరామ్, సామంతుల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో కేక్ కట్ చేస్తున్న స్నేహితులు

ప్రజాసేవ చేసే అధికారులకే గుర్తింపు

ప్రత్తిపాడు: నిస్వార్థంగా ప్రజా సేవ చేసే ఉద్యోగులకే ప్రజా గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు కొనియాడారు. ప్రత్తిపాడు ఎల్ఎఫ్‌టీఎల్ బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో పదవీ విరమణ చేసిన కదారి రాజకుమారిని చర్చి సంఘ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. 37 ఏళ్ల వైద్య వృత్తిలో కొనసాగి, రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్ఓగా ఆమె పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా సంఘ కాపరి జె.జాన్ సామ్యూల్ ఆధ్వర్యంలో డీబీఎఫ్ ప్రతినిధి మూరా చినబాబు, విశ్రాంత సీహెచ్ఓ లక్ష్మి, వైద్య సిబ్బంది కదారి రాజకుమారి దంపతులను ఘనంగా సన్మానించారు.


రాజకుమారి దంపతులను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

ఘనంగా ముదునూరి జన్మదిన వేడుకలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మురళీరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మురునూరి సీతారామరాజు, కోలా తాతబాబు పాల్గొన్నారు.


ధర్మవరంలో కేక్ కట్ చేస్తున్న మురళీకృష్ణంరాజు

ఆగస్టు 1న మాదిగలకు స్వాతంత్య్రం


ఆరుగుల మోషే

కోటనందూరు: భారతదేశానికి ఆగస్టు 15న స్వాతంత్య్రం వస్తే రాష్ట్రంలో మాదిగలకు ఆగస్టు 1న స్వాతంత్య్రం వచ్చిందని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ వల్ల ఎస్సీల్లో కొందరికి మాత్రమే మేలు జరిగిందన్నారు. ఎస్సీల్లో 1,100 అనుబంధ కులాలు తమ జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు పొందక అన్యాయానికి గురయ్యారన్నారు. వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాలుగా రాజీ లేని పోరాటం చేసిందన్నారు. నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ధర్మాసనం సుదీర్ఘ చర్చల అనంతరం 2024 ఆగస్టు 1న వర్గీకరణకు అనుకూలంగా తీర్పిచ్చిందన్నారు. ఇకపై ఏటా ఆగస్టు 1న సామాజిక న్యాయం గెలిచిన రోజుగా జరుపుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.